సూర్య
నేటి దినపత్రిక
18వ
www.suryaa.com
కాకినాడ జిల్లా | తూర్పుగోదావరి జిల్లా
కోనసీమ జిల్లా | అల్లూరి సీతారామరాజు జిల్లా

ఆంధ్రా కాపు సద్భావన సంఘం ఆధ్వర్యంలో విజయోత్సవ సభ

- సంఘ అధ్యక్షులు వాసిరెడ్డికి ఘన సత్కారం

కాకినాడ రూరల్,మేజర్న్యూస్ : కార్తీక మాసంలో గత నెల 24వ తేదీన నిర్వహించిన కాపు వన సమరాధన అందరి కృషితో విజయవంతం కావడంతో విజయోత్సవ సభ మంగళవారం ఘనంగా నిర్వహించారు.స్థానిక ఎన్.ఎఫ్.సి.ఎల్. రోడ్డులో ఉన్న శుభం కాపు కళ్యాణ మండపం ఆవరణలో నవ సంఘం ఆధ్వర్యంలో కాపు కార్తీకమాస వనభోజన మహోత్సవం రాష్ట్ర స్థాయిలో అంగరంగవైభవంగా నిర్వహించిన సందర్భంగా సంఘ అధ్యక్షులు వాసిరెడ్డి ఏసుదాసు, గౌరవ అధ్యక్షులు బసవా ప్రభాకర్ రావు, కార్యదర్శి చిట్నీడి శ్రీనివాస్, కోశాధికారి రంగనాయకులు అధ్యక్షతన కార్యవర్గ సభ్యులు, జీవితకాల సంఘ సభ్యులు మరియు పాత్రికేయ మిత్రులతో సక్సెస్ మీట్ ఏర్పాటు చేసి అనంతరం ఆత్మీయ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షులు వాసిరెడ్డి ఏసుదాస్ మాట్లాడుతూ 40 సంవత్సరాల చరిత్ర ఉన్న ఈ సంఘం ప్రతి ఏటా కార్తీక వన సమారాధన ఏర్పాటు చేయడం, దానికి మీ సహాయ సహకారాలు అందించడం ఆనందంగా ఉందన్నారు. సంఘం మనకు ఏమి చేసింది అని కాకుండా సంఘానికి మనం ఏం చేశాము అని ప్రతి ఒక్కరు ఆలోచించాలని దాసు సూచించారు. సంఘానికి విరాళాలు కాయగూరల రూపంలో అందించిన వ్యాపారస్తులను, పలువురు ప్రముఖులను, పాత్రికేయ మిత్రులను ఘనంగా సత్కరించారు. అనంతరం సంఘ అధ్యక్షులు వాసిరెడ్డి ఏసుదాసును కార్యవర్గ సభ్యులు సన్మాన పత్రంతో దుస్సాలువా కప్పి గజమాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాపు సంఘ నాయకులు, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా మిత్రులు తదితరులు పాల్గొన్నారు.

ఏజెన్సీలో ఇరువురు వైద్యాధికారులు సస్పెన్షన్

- ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం

రంపచోడవరం,మేజర్న్యూస్ : గుర్తేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విధులకు గైర్హాజర్ అయిన ఇద్దరు వైద్యాధికారులను విధుల నుండి సస్పెండ్ చేస్తున్నట్టు రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం పేర్కొన్నారు. స్థానిక ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి చాంబర్లో రంపచోడవరం ఐటీడీఏప్రాజెక్ట్ అధికారి కట్టాసింహాచలం మాట్లాడుతూ గుర్తేడు పంచాయతీ సర్పంచ్ గొర్లె దుష్యాంతుడు వై.రామవరం మండలం గుర్తేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ద్వారా గుర్తేడు పంచాయతీ, ధారగడ్డ పంచాయితీ, పాతకోట పంచాయతీ గిరిజన ప్రజలకు వైద్య సేవ అందించే వైద్యాధికారులు విధులకు సరిగా హాజరు కావడం లేదని ఫిర్యాదు మేరకు డాక్టర్ జగదీష్ నాయక్, డాక్టర్ రాజు రాజేష్ ను విధులపై నిర్లక్ష్యం వహించి గైరాజరైనందువలన విధుల నుండి సస్పెండ్ చేయడం జరిగిందని ప్రాజెక్ట్ అధికారి తెలిపారు. అదేవిధంగా గిరిజన ప్రాంతంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో గిరిజన ప్రజలకు వైద్య సేవలు అందించడంలో నిర్లక్ష్యం వహించిన అధికారులకు కఠినమైనచర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన తెలిపారు.ఏజెన్సీలోని ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చిన రోగులకు వెంటనే వైద్య పరీక్షలు నిర్వహించి ఆయా వ్యాధులకు ఉచిత మందులు అందజేయాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలంసంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళ వారం రాజవొమ్మంగి మండలం జడ్డంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, వై.రామవరం గ్రామంలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సిహెచ్సి), వై.రామవరం మండలం పి.ఎర్రగొండ గ్రామంలో ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ ను, గిరిజన సంక్షేమశాఖ గురుకుల పాఠశాలను, గంగవరం మండలంలోని కొత్తాడ గ్రామంలో గోకులం షెడ్లను రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం వారితోపాటు, అసిస్టెంట్ కలెక్టర్ భావన పర్యటించి పరిశీలించారు. ఈ సందర్భంగా రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహా చలం మాట్లాడుతూ జడ్డంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించే విధంగా ఎప్పటికప్పుడు వివిధ రకాలైన మందులు అందుబాటులో ఉంచి అదేవిధంగా ఆసుపత్రులకు వచ్చిన రోగులకు వెంటనే వైద్య పరీక్షలు నిర్వహించి ఆయా వ్యాధులకు ఉచిత మందులు అందజేయాలని సంబంధిత వైద్యాధికారులను ఆయన ఆదేశించారు. అదేవిధంగా వై.రామవరం గ్రామంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ను పరిశీలించి ఈ సిహెచ్సిలో ఎంతమంది వైద్యాధికారులున్నది, ఎంతమంది సిబ్బంది ఉన్నది , ప్రతిరోజు ఈ ఆసుపత్రికి ఏ ఏ వ్యాధులతో వచ్చుచున్నది, అదేవిధంగా ఎంతమంది గర్భిణీ స్త్రీలు ఉన్నది ఆయన ఆరా తీశారు. అదేవిధంగా రోగులకు ఏ విధంగా వైద్య సేవలు అందించుచున్నది ఆస్పత్రికి వచ్చిన రోగులను అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్ట్ అధికారి, అసిస్టెంట్ కలెక్టర్ బీపీ, షుగర్ టెస్టులు చేయించుకున్నారు. అదేవిధంగా పి.ఎర్రగొండ గ్రామంలో ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ భవన పనులు, సిబ్బందికి సంబంధించిన క్వాటర్స్ పనులు పరిశీలిం చారు. ఈ భవన పనులు వేగవంతంగా క్వాలిటీతో పనులు పూర్తిచేయా లని సంబంధిత అధికారులను ఆదేశించారు. అదేవిధంగా బాలికల గురుకుల పాఠశాలను పరిశీలించి విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో ఉపాధ్యాయులు పాటలు చెప్పాలని,ప్రభుత్వ నిబంధనల ప్రకారం మెనూ అమలు చేయాలని, విద్యార్థులకు ఎవరికైనా అనారోగ్యంగా ఉన్న ఎడలవెంటనే ఆసుపత్రికి తీసుకొనివెళ్లి వైద్యంచేయించాలని సంబంధిత అధికారులను ప్రాజెక్ట్అధికారిఆదేశించారు.ఉపాధ్యాయులు విద్యార్థులకు చెప్పిన పాఠాలు అర్థమవుతున్నది లేనిది విద్యార్థులను ప్రాజెక్ట్ అధికారి అడిగి తెలుసుకున్నారు.గంగవరం మండలం కొత్తాడ గ్రామంలో గోకులం షెడ్లు ప్రాజెక్ట్ అధికారి, అసిస్టెంట్ కలెక్టర్ పరిశీలించారు. ప్రాజెక్ట్ అధికారి వెంట గిరిజన సంక్షేమ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఐ.శ్రీనివాసరావు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నాగరాజు, ప్రిన్సిపాల్ పి.రామకృష్ణ, భైరవ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం

రౌతులపూడి,మేజర్న్యూస్ : రౌతులపూడి మండలంలోని స్థానిక భవిత కేంద్రం వద్ద ఐఇఆర్పి యస్.కే శ్రీనివాస్ ప్రపంచ దివ్యాంగుల దినో త్సవం ఘనంగా నిర్వహించారు.దివ్యాంగ పిల్లలకు విజ్ఞానంతో కూడిన ఆయా చిన్నపాటి ఆటలు పాటలు పోటీలు నిర్వహించారు. పిల్లలకు బహుమతులు ఎంపీపీ స్కూల్ కోట వీధి ప్రధానోపాధ్యాయులు ఎన్.సింహాచలం చేతుల మీదుగా బహుమతులు అందచేసారు.ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ అంగవైకల్యం కలిగిన దివ్యాంగు పిల్లలను ప్రతి ఒక్కరూ వారి అభివృద్ధి సహకరించాలని అన్నారు.అన్ని రంగాలలో రాణిస్తున్న దివ్యాంగుల మహానుభావులు ఆదర్శంగా తీసుకోవాలని పిల్లలకు సూచించారు. అంగవైకల్యంతో చింతించకుండా ప్రభుత్వ అందిస్తున్న సహకారాలను వినియోగించు కొని ఉన్నత శిఖరాలకు ఎదగాలన్నారు. వికలాంగులకు అందరూ సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో యం.అప్పరావు సిఆర్యం టి.వినకోటి శ్రీనివాస్.ఐఇడియస్ యస్, టీచర్ యం. రామలక్ష్మి పాల్గొన్నారు.

రైతులు ముందస్తు రబీ వేసేందుకు సిద్ధం ఉండాలి

-జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎన్.విజయకుమార్

పిఠాపురం,మేజర్న్యూస్ : రైతులు ముందస్తు రబీ పంట వేసేందుకు సిద్ధంగా ఉండాలని కాకినాడ జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎన్. విజయకుమార్ పిలుపునిచ్చారు.పిఠాపురం మండలం జల్లూరు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారుఈ మేరకు పిఠాపురం వ్యవసాయ శాఖ అధికారి పి. స్వాతి పత్రికా ప్రకటన విడుదల చేశారు. రైతులను ఉద్దేశించి జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విజయకుమార్ మాట్లాడుతూ... ప్రస్తుత వాతావరణ పరిస్థితుల ఆధారంగా వరి పంట కోతలు నిర్వహించాలని, ప్రభుత్వ మద్దతు ధర (సాధారణ రకాలకు రూ.2300/క్వింటాల్, గ్రేడ్-%ూ% రూ.2320/క్వింటాల్) కన్నా తక్కువ రేటుకు ధాన్యాన్ని అమ్ముకోవద్దని తెలిపారు. ధాన్యంలో తేమ శాతం 17 కంటే ఎక్కువ ఉంటే క్వింటాల్ కి 1కిలో కటింగ్ చేస్తారని, రైతులు అందరూ ముందస్తు రబీ పంటను వేసేందుకు సిద్ధంగా ఉండాలి డిసెంబర్ నెల ఆఖరిలోపు వరి నాట్లు వేయడం పూర్తి చేసుకోవడం తద్వారా వేసవికాలంలో అపరాల పంటలను పండించే అవకాశం ఉంటుందన్నారు. కౌలు రైతులు తప్పని సరిగా రైతు సేవా కేంద్రం (ఆర్ఎస్కె) సిబ్బంది ద్వారా పంట నమోదు చేయించుకోవడం వలన వ్యవసాయ శాఖ నుండి వచ్చే అన్ని పథకాలకు అర్హత పొందుతారని తెలియజేసారు.ఈకార్యక్రమంలో ఆత్మపీడీ జోతిర్మయి, పిఠాపురం వ్యవసాయ శాఖ అధికారి పి.స్వాతి, మండల వ్యవసాయ శాఖ అధికారి ఎ.అచ్యుతరావు, రైతు సేవాకేంద్రం సిబ్బంది, జనసేన పార్టీ నాయకులు వెన్న జగదీష్ మరియు రైతులు పాల్గొన్నారు.

స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా అధికారులు చర్యలు చేపట్టాలి

ఉమ్మడిగోదావరి జిల్లాల సూర్య బ్యూరో : డిసెంబర్ 5న జరిగే ఉమ్మడి తూర్పు-పశ్చిమ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ నియోజకవర్గ ఎన్నిక ప్రక్రియ స్వేచ్ఛాయుత వాతావరణంలో జరిగేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఎమ్మెల్సీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కాకినాడ జిల్లా కలెక్టర్ షణ్మోహన్ అధికారులను ఆదేశించారు.ఉమ్మడి తూర్పు- పశ్చిమ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లపై మంగళవారం కాకినాడ కలెక్టరేట్ లో ఆర్వో, జిల్లా కలెక్టర్ షణ్మోహన్..ఏఆర్వో, కాకినాడ జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావుతో కలిసి కాకినాడ, పెద్దాపురం ఆర్డీవోలు, అన్ని మండలాల తహశీల్దార్లుతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. పోలింగ్ రోజున అనుసరించాల్సిన విధానం, వెబ్ కాస్టింగ్, పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్సులు స్ట్రాంగ్ రూమ్ కి తరలించడం, రిసెప్షన్ సెంటర్లు సెక్టార్, రూట్ అధికారాలు, పోలీస్ బందోబస్తు, డిస్ట్రిబ్యూషన్ సెంటర్లు వంటి ఏర్పాట్లపై ఆయన చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలపై ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. డిసెంబర్ 5వ తేదీ పోలింగ్ ప్రారంభం నుంచి చివరి వరకు ఎటువంటి తప్పులకు తావులేకుండా స్వేచ్ఛాయుత వాతావరణ ఎన్నిక జరిగేందుకు కృషి చేయాలన్నారు. ఆరు జిల్లాల పరిధిలో జరిగే ఈ ఉపాధ్యాయ ఎన్నికల్లో మొత్తం ఐదు మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారని, ఇందు కాకినాడ జిల్లాలో 22 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. పోలింగ్ సిబ్బందికి కాకినాడ మెక్లెరెన్ పాఠశాల వద్ద, పెద్దాపురం ఆర్డీవోలు కార్యాలయంలో 4వ తేదీ ఉదయం 9:00 గంటల నుంచి పోలింగ్ సామాగ్రి డిస్ట్రిబ్యూషన్ మొదలవుతుందన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లోని వెబ్ కాస్టింగ్ విధానంలో పోలింగ్ నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు. పోలింగ్ ముగిసిన అనంతరం పోలింగ్ సిబ్బంది బ్యాలెట్ బాక్సులను కాకినాడ జేఎన్టీయూలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్ కు సురక్షితంగా తరలించాలన్నారు. జేఎన్టీయూ డా.బీఆర్.అంబేద్కర్ సెంట్రల్ లైబ్రరీ వద్ద రిసెప్షన్ కౌంటర్లను ప్రత్యేకంగా ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్లో కలెక్టరేట్ ఎన్నికల విభాగం ఉప తహసీల్దార్ ఎం.జగన్నాథం, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మానవాళి మనుగడకు చెట్టు తొలిమెట్టు

-డాక్టర్ విజయబాబు..

ఏలేశ్వరం,మేజర్న్యూస్ : మానవాళి మనుగడకు చెట్లు తొలి మెట్లని పకృతి పర్యావరణ పరిరక్షణ సమితి అధ్యక్షులు డాక్టర్ విజయబాబు అన్నారు. మంగళవారం ఏలేశ్వరం నగర పంచాయతీ పరిధిలో తాసిల్దార్ కార్యాలయం నుంచినందివీధి వరకు గల ప్రధాన రహదారి ప్రక్కన మొక్కలునాటే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభిం చారు. ఈ సందర్భంగా డాక్టర్ విజయబాబు మాట్లాడుతూ పర్యావరణ సమతుల్యాన్ని కాపాడే మొక్కలు నాటే అలవాటును ప్రతి ఒక్కరు అలవర్చుకోవాలన్నారు. అలాగే సమాజంలో తన వంతు బాధ్యతగా రెవెన్యూ కార్యాలయంలో సేవలందించి తాసిల్దార్ గా పదవీ విరమణ పొందిన కరోతు సత్యనారాయణ మొక్కలు వితరణ చేయడాన్ని ఆయన అభినందించారు. మానవాళికి ప్రాణవాయువు అందించే మొక్కలను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి పైన ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి పర్యావరణ పరిరక్షణ సమితి ఉపాధ్యక్షులు డాక్టర్ అనుసూరి నాగేశ్వరరావు, కార్యదర్శి గోళ్ళ నాగేశ్వరరావు, సభ్యులు తాళ్లూరు గొల్లజీరావు, కోట శ్రీనివాస చక్రవర్తి, రౌతు సహదేవుడు, పెచ్చెట్టి కృష్ణ, జాగా నిత్యానందం, నారాయణ రావు, బెల్లంపల్లి సుబ్బారావు, తిరగట్టి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగ విద్యార్థులు అందరితో పోటీపడాలి

కొత్తపేట,మేజర్న్యూస్ : దివ్యాంగ విద్యార్థులను సమాజంలోని అందరితో సమానంగా పోటీపడేలా తల్లిదండ్రులు సహకరించా లని మండల విద్యాశాఖ అధికారి ఎమ్.హరిప్రసాద్ సూచించారు. మండలం లోనిగౌతమినగర్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో భవిత కేంద్రం నందు ప్రధానోపాధ్యాయుడు ఏ.సుభాష్ చంద్రశేఖర్ అధ్యక్షతన ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం ఘనంగా నిర్వహించి నారు.ఈ కార్యక్రమానికి మండల విద్యాశాఖ అధికారులు ఎమ్.హరిప్రసాద్,కే.లీలావతి హాజరయ్యారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ దివ్యాంగుల విద్యార్థులను తల్లిదండ్రులు ప్రతిరోజు వారిని భవిత సెంటర్ కు తీసుకొని రావాలని,వారికి ప్రభుత్వం అందించే సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ప్రత్యేక అవసరాలు పిల్లలను వారి తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని వారి మానసిక శారీరక అభివృద్ధికి తోడ్పడాలని సూచించారు.మేనరికి వివాహాలను తగ్గించడం ద్వారా దివ్యంగుల సంఖ్య పెరగకుండా చేయవచ్చని తెలియజేశారు. ప్రభుత్వం అందించే వివిధ సేవలను పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.అనంతరంవిద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎన్.సత్యనారాయణ, ఉపాధ్యాయురాలు కే.లక్ష్మీకుమారి, కే.సత్యనారాయణ,కె.వెంకటేశ్వరరావు,మండల విద్యాశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పిడిఎస్ బియ్యం తయారీ తదితర దశలపై

అవగాహన పెంపొందించుకోవాలి

- తనిఖీలను సమర్ధవంతంగా నిర్వహించాలి - అధికారులకు జిల్లా కలెక్టర్ ఆదేశం

ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్య బ్యూరో : ప్రజా పంపిణీ వ్యవస్థలో భాగంగా పంపిణీ చేస్తున్న బియ్యం అక్రమ రవాణా, రీసైక్లింగ్ నివారించెం దుకు పీడిఎస్ బియ్యంతయారి,పంపిణీ, రవాణా లోని వివిధ దశలపై అధికారులు అవగాహన పెంపొందించుకోవాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్లో జిల్లా కలెక్టర్ షణ్మోహన్.జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్, జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనాలతో కలిసి పౌరసరఫరాలు,పోలీస్ అధికా రులతో వర్క్ షాప్ నిర్వహించారు. బియ్యాన్ని ఏలా తనిఖీ చేయాలి, శాంపిల్ ఎలా తీయాలి, దానిని ఎలా పరీక్షించాలి, రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని పీడిఎస్ బియ్యంగా మార్చడంలో ఉన్న దశలను, రైస్ మిల్లుల నుంచి బియ్యం ఎన్ని రకాలుగా మార్కెట్లోకి వస్తున్నాయి, అక్రమాలు గుర్తిస్తే ఏవిధంగా కేసు నమోదు చేయాలి, మిల్లర్ల నుంచి తీసుకున్న బ్యాంకు గ్యారంటీలు, తనిఖీలలో భాగంగా ఎగుమతిదారుల నుంచి తీసుకున్న బిల్లులు వంటి అంశాలపై ఈ వర్క్ షాప్లో పౌరసరఫరాల టెక్నికల్ సిబ్బంది.. పోలీసు అధికారులకు ప్రత్యేక అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ జిల్లాలో అక్రమ బియ్యం రవాణా, రీసైక్లింగ్ బియ్యాన్ని గుర్తించేందుకు చేపట్టనున్న తనిఖీలను సమర్ధవంతంగా నిర్వహించాలన్నారు. ఇందుకు ప్రజా పంపిణీ వ్యవస్థలో భాగంగా పేద ప్రజలకు పంపిణీ చేస్తున్న బియ్యం అక్రమ రవాణా, రీసైక్లింగ్ నిరోధించెందుకు పీడిఎస్ బియ్యం తయారి, పంపిణీ, రవాణాలోని వివిధ దశలపై అధికారులు సంపూర్ణ అవగాహన పెంపొందించుకోవాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. వర్క్ షాప్ లో పౌరసరఫరాల సంస్థ డీఎం ఎం.దేవులా నాయక్, ఇంన్చార్జ్ డీఎస్పో టీ.లక్ష్మీప్రసన్న దేవీ, కాకినాడ డీఎస్పీ రఘువీర్ విష్ణు ఇతర పోలీస్ అధికారులు, పౌరసరఫరాల శాఖ టెక్నాల్ సిబ్బంది ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పరిహారం కోసం జరిగే బహిరంగ సభను జయప్రదం చేయండి -సిపిఐ

కూనవరం,మేజర్న్యూస్ : 10వ తేదీన వేలేరుపాడు లో సిపిఐ రాష్ట్ర నాయకత్వం ఆధ్వర్యంలో భారీ బహిరంగ సభను జరపనుంది. పోలవరం నిర్వాసితుల ప్యాకేజీ, పునరావాసం, ప్రథమ ప్రధాన్యత గ్రామాల జాబితా లో మరిన్ని గ్రామాలను చేర్చే అంశంపై రీ సర్వే చేసి నిర్వాసితులందరికీ త్వరగా ప్యాకేజీ వేసే అంశంపై ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చే దిశగా సిపిఐ బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చింది. ఈ మేరకు కూనవరం లోని సిపిఐ కార్యాలయంలో ఏర్పాటుచేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో కామ్రేడ్ గుజ్జా మోహన్ రావు జిల్లా కౌన్సిల్ సభ్యులు కామ్రేడ్ కందుకూరి స్వర్ణ మాట్లాడారు కాండూర్ లెక్కలతో పని లేకుండా 2022 గోదావరి వరదలకు ముంపుకి గురైన ప్రతి గ్రామాన్ని ప్రథమ ప్రాధాన్యత జాబితాలో చేర్చి తక్షణమే పరిహారం ఇవ్వాలని ప్రధాన డిమాండ్ ను సాధించుకోవడం కోసం అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. ఈ సమావేశంలో కూనవరం మండలం కార్యదర్శి లంబు శ్రీనివాసరావు సీనియర్ నాయకులు జుతుక సూర్యచంద్రరావు, సురేశ్, వి ఆర్ పురం మండల కార్యదర్శి కర్నాటి ఏసు ఎటపాక మండల కార్యదర్శి వెలిశాల నాగరాజు, కంటే రాజు, మహిళ నాయకురాలు గుంటుక కుసుమరాణి చింతూరు నాయకులు ఎస్.కె రంజాన్ తదితరులు పాల్గొన్నారు.

మెప్మా ఆధ్వర్యంలో అంతర్జాతీయ ప్రతిభావంతుల దినోత్సవం

కాకినాడ, మేజర్న్యూస్ : అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని మంగళవారం కాకినాడ నగరపాలక సంస్థ మెప్మా విభాగం ఆధ్వర్యంలో స్థానిక రామకృష్ణారావుపేట మార్కెట్ కమ్యూనిటీ హాలులో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మెప్మా పీడీ బి.ప్రియంవద, టౌన్ ప్రాజెక్ట్ ఆఫీసర్ కె.శైలజ హాజరయ్యారు.ఈసందర్భంగా అతిథులు మాట్లాడుతూ ఈ విధముగా ఈరోజు మీ అందరి సమక్షంలో ఈ సమయం గడపడం చాలా అదృష్టమన్నారు. మీరందరూ మీ యొక్క రంగాలలో ప్రతిభ కనబరిచి మరింత ముందుకు వెళ్లాలని కోరారు. ఈ సందర్భంగా విభిన్న ప్రతిభావంతులను,వీరికిరుణాలు మంజూరు చేసిన బ్యాంక్ మేనేజర్ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మెప్మా సిటీ మిషన్ మేనేజర్ డి.వెంకట్రాజు, యూపీఏ సెక్షన్ సతీష్, సీఓ సునీత, ఆర్పీలు పాల్గొన్నారు.

ఘంటసాల 102వ జయంతి

ధవళేశ్వరం,మేజర్న్యూస్ : గానగంధర్వులు పద్మశ్రీ ఘంటసాల వెంకటేశ్వరరావు 102 వ జయంతి వేడుకలు గోదావరి కల్చర్ క్లబ్ "రాక" సంస్థ సంయుక్త ఆధ్వర్యలో ధవళేశ్వరం జలవనరుల శాఖ పర్యవేక్షక ఇంజనీర్ కార్యాలయం ఆవరణలో గల ఘంటసాల విగ్రహం వద్ద 4-12-24 ఉదయం 10 గం.లకు జరుగునని గోదావరి కల్చరల్ క్లబ్ అధ్యక్షులు జివి రమణ తెలియజేశారు. ఘంటసాల అభిమానులు, సంగీత అభిమానులు తప్పక పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయవలసిందిగా కోరారు.

కర్ర సాము అంతర్జాతీయ క్రీడాకారుడు డాక్టర్ ఖరీదు సాంబయ్యకి ఘన సన్మానం

కాకినాడ,మేజర్న్యూస్ : అంతర్జాతీయ కర్రసాము క్రీడాకారుడు, గుంటూరు జిల్లా ఫిరంగిపురం వాస్తవ్యులు డాక్టర్ అవార్డు గ్రహీత ఖరీదు సాంబయ్యను కాపు జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వాసిరెడ్డి ఏసుదాసు, కాకినాడలో శుభం కాపు కళ్యాణమండపంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాపు సంఘాల కోఆర్డినేటర్ కాపురత్న కె.వి.ఆర్ నాయుడు, బసవా ప్రభాకర్ రావు, సిద్దు నూకరాజు, పీసుపాటి సేతు మాధవరావు, సలాది సత్యనారాయణ మూర్తి, గంగిరెడ్డి వెంకట రమణ మూర్తి, తిరుమలశెట్టి మురళి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సామర్లకోటలో 6200 సభ్యత్వ నమోదు

సామర్లకోట,మేజర్న్యూస్ : నియోజక వర్గ పరిధిలో సామర్లకోట పట్టణంలో తెలుగుదేశం పార్టీ సభ్యత్వాలు ఇప్పటి వరకు 6200 పూర్తి చేసినట్టు పార్టీ పట్టణ అధ్యక్షులు అడబాల కుమారస్వామి, కార్యదర్శి బడుగు శ్రీకాంత్ లు చెప్పారు. సామర్లకోట పట్టణంలో 13వ వార్డులో నాయకులు కాళ్ళ రవీంద్ర ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మంగళవారం జోరుగా చేపట్టారు. ఈ సందర్భంగా అధ్యక్ష కార్యదర్సులు మాట్లాడుతూ పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప నేత్రత్వంలో సామర్లకోట పట్టణంలో పదివేల సభ్యత్వ నమోదులు లక్ష్యంగా కలిగి ముందుకేళుతున్నట్టు చెప్పారు. దానిలో భాగంగా ఇప్పటివరకు పలు వార్డుల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో 6,200 సభ్యత్వ నమోదులు ప్రజల నుంచి చేసినట్టు చెప్పారు. వచ్చే సంక్రాంతి పండుగ లోగా 10వేల సభ్యత్వాలు పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నట్టు వారు తెలుపుతూ దీనికి సహకరిస్తున్న వార్డు అధ్యక్షులు, ఇంచార్జిలు, పార్టీ నాయకులకు అభినందనలు తెలిపారు.

సమగ్ర తనిఖీకై మల్టీ డిసిప్లినరీ కమిటీ ఏర్పాటు

ఉమ్మడిగోదావరి జిల్లాల సూర్య బ్యూరో : గత నెల 27వ తేదీన కాకినాడ యాంకరేజి పోర్టులో తనిఖీ చేసిన స్టెల్లా ఎల్ నౌకలో పిడిఎస్ బియ్యం గుర్తించిన నేపద్యంలో షిప్ లోడ్ చేసిన మొత్తం బియ్యాన్ని సమగ్రంగా తనిఖీ చేసేందుకు ఐదు ప్రభుత్వ శాఖల అధికారులతో కూడిన మల్టీ డిసిప్లినరీ కమిటీ ఏర్పాటు చేసామని జిల్లా కలక్టర్ షణ్మోహన్ సగిలి తెలియజేశారు.మంగళవారం మద్యాహ్నం జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి, కలెక్టరేట్‌లోని తన ఛాంబరులో జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ విక్రాంత్ పాటిల్‌తో కలిసి ప్రెస్ మీట్ నిర్వహించి, పిడిఎస్ బియ్యం అక్రమ తరలింపు, రిసైక్లింగ్ నిరోధానికి చేపట్టిన కార్యాచరణలను మీడియా ప్రతినిధులకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నెల 27న తాను, కాకినాడ ఆర్డిఓతో కలిసి కాకినాడ యాంకరేజి పోర్టులో స్టెల్లా ఎల్ నౌకలో జరిపిన తనిఖీలో పిడిఎస్ బియ్యాన్ని గుర్తించామన్నారు. ఈ బియ్యం గతంలో సీజ్ చేసి బ్యాంకు గ్యారంటీపై రిలీజ్ చేసిన బియ్యమా లేక పిడిఎస్ నుండి తరలించిన బియ్యమా నిర్ధారణకు వెరిఫికేషన్ చేపట్టామని తెలిపారు. ఈ వెరిఫికేషన్ నిమిత్తం రెవెన్యూ, పోలీస్, కస్టమ్స్, పౌరసరఫరాలు, పోర్టు అధికారులతో కూడిన మల్టీడిసిప్లినరీ కమిటీ ఏర్పాటు చేసామన్నారు. ఈ కమిటీ స్టెల్లా ఎల్ షిప్‌లో ఉన్న మొత్తం బియ్యాన్ని తనిఖీ చేసి, నమూనాలు,సంబంధిత డాక్యుమెంట్లను తీసుకుని విశ్లేషించి నివేదిక సమర్పిస్తుందని తెలిపారు. షిప్పులోనికిబియ్యం ఏ ఎగుమతి దారు నుండి షిప్పులోకి వెళ్లింది, అతనికి ఏమిల్లులు బియ్యం సప్లయి చేసాయి, సదరు ఎగుమతిదారుడు, మిల్లులకు సంబంధించిన బిల్లులు, ఎగుమతిదారు నిల్వలు ఉంచిన గౌడౌన్ నుంచి షిప్పు వరకూ జరిపిన రవాణాకు సంబంధించిన ట్రక్‌షీట్లుతనిఖీకూలంకుషంగా చేస్తుంన్నారు. ఈ తనిఖీ ద్వారా షిప్పులో ఉన్నది పిడిఎస్ బియ్యామా, పిడిఎస్ బియ్యమైతే బ్యాంకు గ్యారంటీ ఇచ్చినదా అనే అంశాలను నిర్ధారించడం జరుగుతుందని తెలిపారు. ఒక వేళ బ్యాంకు గ్యారంటీ ఇచ్చిన బియ్యం అయితే ఎగుమతి చేయవచ్చా అనే అంశంపై లీగల్ ఓపీనియన్ తీసుకుంటున్నామన్నారు. ప్రస్తుతం స్టెల్లా ఎల్ షిప్పు పోర్ట్ కంట్రోల్‌లోనే ఉందని, కమిటీ నివేదిక ఆధారంగా ఈ అంశంలో తదుపరి చర్యలు గైకొనడం జరుగుతుందని కలెక్టర్ తెలియజేశారు. ఉపముఖ్యమంత్రి ఆదేశాలకనుగుంగా, కాకినాడ పోర్ట్ ద్వారా ఎటువంటి అక్రమ కార్యకలాపాలు జరుగకుండా పటిష్టమైన చర్యలు చేపడుతున్నామని ఆయన తెలిపారు. ఇందులో భాగాంగానే రెవెన్యూ, పోలీస్, సివిల్ సప్లయిస్, పోర్ట్, కస్టమ్ అధికారులకు బియ్యాన్ని ఏలా తనిఖీ చేయాలి, శాంపిల్ ఎలా తీయాలి, దానిని ఎలా పరీక్షించాలి, అక్రమాలు గుర్తిస్తే ఏవిధంగా కేసు నమోదు చేయాలనే అంశాలపై ప్రత్యేక అవగాహన, శిక్షణా కార్యక్రమాలు నిర్వహించి ప్రత్యేక టీములు ఏర్పాటు చేస్తున్నామన్నారు. రేపటి నుండి బియ్యం అక్రమ తరలింపు గురించి సమాచారం అందినపుడు ఈ టీములు తక్షణం స్పందించి తనిఖీలు నిర్వహిస్తాయన్నారు. రేషన్ బియ్యం అక్రమాలను అరికట్టేందుకు చెక్ పోస్ట్‌లను మరింత బలోపేతం చేస్తున్నామని, 24 గంటలు తనిఖీలు నిర్వహించేలా మూడు షిఫ్ట్ లలో శిక్షణ కల్పించిన టీములను నియమిస్తున్నామని తెలియజేశారు. పోర్టుకు వచ్చే ప్రతి వాహనాన్ని ఈ టీములు తనిఖీ చేసి, పిడిఎస్ రైస్ తరలిస్తున్నట్లు గుర్తిస్తే వాహనాలను, లోడ్ ను సీజ్ చేసి, వాహనం ఏ గౌడౌన్ నుండి వచ్చిందో గుర్తించి, ఆ గౌడౌన్‌లో ఇంకా అటువంటి బియ్యం ఉంటే దానికి కూడా సీజ్ చేస్తాయన్నారు. శ్రీకాకుళం నుండి చిత్తూరు వరకూ బయటి జిల్లాల నుండి కాకినాడ పోర్టుకు వచ్చే బియ్యాన్ని ఆయా జిల్లాల్లోనే తనిఖీ చేసేందుకు ప్రమాణిక విధివిధానాలను రాష్ట్ర స్థాయిలో రూపొందించి అమలు చేయనున్నారని తెలిపారు. బియ్యం అక్రమ రవాణా, తనిఖీల నిర్వహణకు సంబందించి తమ దృష్టికి వచ్చిన సమాచారాన్ని మీడియా ప్రతినిధులు తనకు తెలియజేయాలని కోరుతూ, అందరి సహకారంతో, రేషన్ బియ్యం అక్రమాల జాడ్యాన్ని సమర్ధవంతంగా అరికడతామని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు.

మన్యంలో మావోల వారోత్సవాల సందర్భంగా వాహన తనిఖీలు

చింతూరు, మేజర్న్యూస్ : మన్యంలోని మావోయిస్టుల వారోత్సవాల సందర్భంగా అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్, చింతూరు ఏఎస్పీ పంకజ్‌కుమార్ మీనా,చింతూరు సిఐ దురా ప్రసాద్ ఆదేశాల మేరకు డొంకరాయి ఎస్సై శివకుమార్ ఆధ్వర్యంలో మంగళవారం డొంకరాయి పోలీస్ స్టేషన్ పరిధిలో వాహనాలు తనిఖీ ముమ్మరం చేశారు. మన్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు డొంకరా ఎస్సై శివకుమార్ తెలిపారు.

ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో మద్యం దుకాణాల మూత

– ఎక్సైజ్ సిఐ అర్జునరావు

పెద్దాపురం,మేజర్న్యూస్ : ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఉప ఎన్నికలు ఈ నెల 5న జరగుతున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్,ఎక్సైజ్‌శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మంగళవారం సాయంత్రం 4 గంటల నుండి 5వ తేది సాయంత్రం 4 గంటల వరకు పెద్దాపురం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో గల పెద్దాపురం, జగ్గంపే, గండేపల్లి మండలాలలో ఉన్న మద్యం దుకాణాలు మూతవేయబడునని ఎక్సైజ్ సిఐ కె.వి.వి.డి. అర్జునరావు తెలిపారు.

కానూరు నెంబర్ త్రీ పాఠశాలలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం

పెరవలి, మేజర్ న్యూస్ : కానూరు నెంబర్ త్రీ ప్రాథమిక పాఠశాల నందు ఉన్న భవిత కేంద్రంలో డిసెంబర్ 3 వ తేదీ మంగళవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం జరిగింది.ప్రధానోపాధ్యాయులు ఎస్.కె మస్తాన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి మండల విద్యాశాఖ అధికారి స్వరూప్, షేక్ నూర్జహాన్ ల ముఖ్య అతిథులుగా విచ్చేసి విద్యార్థులకు చక్కని సందేశాన్ని ఇచ్చి పాటలు పాడి అలరించారు. అలాగే కానూరు గ్రామానికి చెందిన టి రాము అనే సామాజిక వేత్త మిమిక్రీ ప్రోగ్రాం ఏర్పాటు చేసి మాచవరపు కరుణకుమార్ అనే ఆర్టిస్టు చేత పిల్లలను అలరించారు. ఈ సందర్భంగా కేక్ కటింగ్ చేసి కానూరు మాజీ సర్పంచ్ అంబటి బ్రహ్మయ్య, నిడదవోలు బిఎస్పీ కన్వీనర్ వెన్నపు సుధాకర్ ల సహకారంతో విద్యార్థులకు దుప్పట్లు పండ్లు బిస్కెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పి వెంకట రాముడు, పి నాగమణి, కే శాంతి, వరలక్ష్మి ,నీలిమ, డాక్టర్ ఉమాగాయత్రి మరియు పాఠశాల సిబ్బందిసుమలత రాము సుశీలపాల్గొన్నారు.అనంతరం తల్లిదండ్రులకు విద్యార్థిని విద్యార్థులకు విందు ఏర్పాటు చేశారు.

విభిన్న ప్రతిభావంతులకు అండగా న్యాయశాఖ

– పిఠాపురం 12వ అదనపు జిల్లా జడ్జి వాసంతి

పిఠాపురం, మేజర్న్యూస్ : విభిన్న ప్రతిభావంతులైన దివ్యాంగులకు అండగా న్యాయశాఖ ఉంటుందని పిఠాపురం 12వ అదనపు జిల్లా జడ్జి ఏ. వాసంతి అన్నారు. అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవంలో భాగంగా పిఠాపురం భవిత కేంద్రంలో మానసిక వికలాంగులకు పిఠాపురం మండల న్యాయ సేవాధికారి సంస్థ ఆధ్వర్యంలో జిల్లా జడ్జి ఏ.వాసంతి పండ్లు బిస్కెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... దివ్యాంగులకు ఎటువంటి అత్యవసర సమస్యలు ఎదురైనా వాటిని పరిష్కరించే దిశగా న్యాయశాఖ వారికి అండగా ఉంటుందని తెలిపారు. సమాజంలో మానసిక వికలాంగులను చిన్న చూపు చూసే ఎటువంటి వారైనా శిక్షార్హులన్నారు. ప్రతి ఒక్కరూ వారికి అండగా ఉంటూ వారికి చేయూతనివ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పిఠాపురం బార్ అసోసియేషన్ అధ్యక్షులు మేరుగ రాజారావు, సీనియర్ న్యాయవాది ఎస్ఎం అలీ, న్యాయవాదులు కె.సత్యవాణి శ్రీ, బాదం ఈశ్వర్ బాబు, కొంగు నూకరాజు, శ్రీనివాస్, మండల విద్యాశాఖ అధికారి కేతి నారాయణదాసు, పారాలీగల్ వాలంటీర్లు కొత్త రాంబాబు, టీ. కామేశ్వరరావు, భవిత విద్యాసంస్థ అధ్యాపకులు బి. రాజశేఖర్, కొండేపూడి శంకర్రావు తదితరులు పాల్గొన్నారు.

ద్వారంపూడి రొయ్యల శుద్ధి కంపెనీ సీజ్ చేయడం సమాజానికి మంచి పరిణామం – డా. మల్లాడి

కాకినాడ, మేజర్న్యూస్ : మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర రెడ్డి కుటుంబానికి చెందిన రొయ్యల శుద్ధి కంపెనీ కాలుష్య నియంత్రణ మండలి సీజ్ చేయడం సమాజానికి మంచి పరిణామమని కాకినాడ పార్లమెంట్ జనసేన ఎన్నికల ఇన్చార్జి, మల్లాడి రామారావు మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డా. మల్లాడి రాజేంద్రప్రసాద్ అన్నారు. ఫిర్యాదు చేసిన వెంటనే స్పందించి చర్యలు తీసుకున్న ఏపి కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్ రిటైర్డ్ ఐఏఎస్ అధికారి డా.పి.కృష్ణయ్యకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను అని మల్లాడి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టాలకు ఎవరు అతీతులు కాదని, అధికారాన్ని దుర్వినియోగం చేస్తూ ప్రజలకు, సమాజానికి నష్టం చేకూర్చే విధంగా ఎవరు ప్రవర్తించినా అధికారులు ఉపేక్షించకూడదన్నారు. ద్వారంపూడి గత ప్రభుత్వ అండదండలు ఉపయోగించుకుని రొయ్యల కంపెనీల ద్వారా భారీగా కాలుష్య నిబంధనలు ఉల్లంగించారన్నారు. ప్రధానంగా వీరభద్ర ఎక్స్‌పోర్ట్ పేరిట ఉన్న రొయ్యల శుద్ధి కంపెనీలో కాలుష్య నియంత్రణ చట్టం నిబంధనలు ఉల్లంఘించి ఎటువంటి అనుమతులు లేకుండా 20టన్నుల ఐస్ ప్లాంటు నిర్వహిస్తున్నారని, గ్రీన్ ఛానల్ లేకుండా ఉన్నట్లు అధికారులను మభ్యపెట్టి దందా చేస్తున్నారని దీనికి అప్పటి యంత్రాంగం చూసీచూడనట్లు వ్యవహరించడం సిగ్గుచేటన్నారు. రొయ్యల శుద్ధి వ్యర్థాలను బయటకి వదిలివేస్తూ ఇష్టానుసారం సమాజానికి, ప్రజలకు ఇబ్బందులకు గురి చేస్తున్నారని ప్రజలకు తెలిసిన విషయమేనన్నారు. ప్రధానంగా కాకినాడ పరిసర ప్రాంతాలలో ఉన్న కర్మాగారాలు కాలుష్య నియంత్రణ మండలి చట్టం నిబంధనలు పాటించేలా అధికారులు పటిష్ఠమైన చర్యలు తీసుకుని కాలుష్య వ్యర్థాలను అరికట్టాలని ఆయన కోరారు.

మోటార్ సైకిల్ మెకానిక్‌లకు ప్రభుత్వం చేయాతనివ్వాలి- రెడ్డి నాయుడు

అమలాపురం, మేజర్ న్యూస్ : జిల్లాలోని ప్రతీ టూ వీలర్ మెకానిక్‌ను ప్రభుత్వం గుర్తించి చేయూతనివ్వాలని అమలాపురం శ్రీ వరసిద్ధి వినాయక మోటార్ సైకిల్ మెకానిక్స్ వెల్ఫేర్ అసోసియేషన్ డా. బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా సెక్రటరీ, పట్టణ అధ్యకక్షులు జి.రెడ్డి నాయుడు పేర్కొన్నారు. స్థానిక గొల్లగూడెంలో శ్రీ వరసిద్ధి వినాయక మోటార్ సైకిల్ మెకానిక్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యకక్షులు రెడ్డి నాయుడు అధ్యక్షతన యూనియన్ సర్వసభ్య సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా అసోసియేషన్ పట్టణ అధ్యకక్షులు జి.రెడ్డి నాయుడు మాట్లాడుతూ రాష్ట్ర టూ వీలర్ మెకానిక్స్ సమస్యలపై గుడివాడ శాసనసభ్యులు రాము అసెంబ్లీలో చర్చించారని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకువెళ్ళిన ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, రాష్ట్ర టూ వీలర్ మెకానిక్ అసోసియేషన్ అధ్యకక్షులు దాయనేని ధర్మ లకు అమలాపురం మోటార్ సైకిల్ మెకానిక్స్ వెల్ఫేర్స్ అసోసియేషన్ వారు కృతజ్ఞతలు తెలిపారు. ఇప్పటి వరకు ఏ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమను గుర్తించలేదని, ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం తమను గుర్తించాలని, రాష్ట్ర వ్యాప్తంగా సుమారుగా ఎనిమిది లక్షల మంది మోటార్ మెకానిక్ కార్మికులు ఉపాధి పొందుతున్నారని, ప్రతి టూ వీలర్ మెకానిక్‌కు కార్మికశాఖ ద్వారా ప్రభుత్వ గుర్తింపు కార్డు ఇవ్వాలని, టూ వీలర్స్ మెకానిక్ వెల్ఫేర్ బోర్డ్ ఏర్పాటు చేయాలని, ప్రభుత్వం గుర్తింపు కార్డు ఉన్న ప్రతి కార్మికునికి ప్రమాదభీమా, వైద్య సాయం అందజేయాలని, పెన్షన్ సౌకర్యం కల్పించాలని వివిధ డిమాండ్ల రూపంలో ప్రభుత్వాన్ని ఆయన కోరారు. ఈ సమావేశంలో అసోసియేషన్ ఉపాధ్యక్షులు గోకరకొండ పూర్ణ బాల, కూర్మ నరసింహరావు, గుమళ్ళ శ్రీను, నల్లా శ్రీనివాసరావు, కాండ్రేగుల గోపి, దంగేటి శ్రీను, అంజూరి వంశీ, కుడుపూడి రామకృష్ణార్జున, కుప్పాలశ్రవణ్ కుమార్, పేరాబత్తుల రమేష్, మానేపల్లి రాము తదితరులు పాల్గొన్నారు.

ఆలిండియా కరాటే పోటీలలో సత్తా చాటిన విద్యార్థులు

రాజమహేంద్రవరం,మేజర్న్యూస్ : ఇటీవల ఢిల్లీలో టాల్ కటోర ఇండోర్ స్టేడియంలో జరిగిన ఆల్ ఇండియా నేషనల్ కరాటే ఇండియా ఆర్గనైజేషన్ ఫెడరేషన్ కప్ ప్రీమియర్ లీగ్ అండ్ యూత్ లీగ్ మ్యాచ్లో ఈస్ట్ గోదావరి జిల్లా రాజమహేంద్రవరం ధవలేశ్వరం కు చెందిన విద్యార్థి విద్యార్థినిలు సిల్వర్ బ్రాంచ్ పథకాలు సాధించారు. ఇందులో గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజ్ కు చెందిన పి.విజయ్ సిల్వర్ మెడల్ సాధించగా లాస్లేట్ స్కూల్ విద్యార్థి కె. జాక్సన్ జడ్పీహెచ్ స్కూల్ ధవలేశ్వరం విద్యార్థిని ఎం.నవ్య శ్రీ మున్సిపల్ స్కూల్ లాలాచెరువుకి చెందిన పి.సత్య వెంకట శ్రీరామ్ మరియు శ్రీ సునంద స్కూల్ కు చెందిన పి. పూజ మరియు కె. లక్ష్మీ భవాని వి. వెంకట కిరణ్మయి బ్రాంజ్ మెడలు సాధించారు ఈ కార్యక్రమానికి హాజరైన కరాటే ఇండియా ఆర్గనైజేషన్ ప్రెసిడెంట్ భరత్ శర్మ చేతుల మీదగా ఈ పథకాలు బహుకరించి సత్కరించారు ఈ కార్యక్రమంలో మాస్టర్ శ్రీ పిల్లి అరుణ్ కుమార్ గారు విద్యార్థి విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.

భవితలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం

– ముఖ్య అతిథులుగా పాల్గొన్న డివైఇఓ, ఎంపిడిఓ, తహశీల్దార్

పెద్దాపురం రూరల్, మేజర్న్యూస్ : పెద్దాపురం భవిత కేంద్రం నందు అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం ఎంఇఓ వి.ఆర్.కె.చౌదరి ఆధ్వర్యంలో మంగళవారం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డివైఇఓ ఈరంకి ప్రభాకరశర్మ, ఎంపిడిఓ డి.శ్రీలలిత, తహశీల్దార్ సిహెచ్.వెంకటలక్ష్మీలు పాల్గొన్నారు.ఎంపిడిఓ శ్రీలలిత మాట్లాడుతూ భవిత సెంటర్‌లో సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. తహశీల్దార్ వెంకటలక్ష్మీ తెలుపుతూ భవిత సెంటర్ నందు విద్యార్థులకు మంచి విద్యతోపాటు ఆహ్లాదకరమైన ఆటలు నేర్పించడం ఎంతో మంచి కార్యక్రమం అని తెలిపారు. డివైఇఓ ప్రభాకర శర్మ మాట్లాడుతూ ఈ కార్యక్రమం జరగడానికి సహకరించిన స్వచ్ఛంద సంస్థలకు విద్యాశాఖ తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఎంఇఓ వి.ఆర్.కె.చౌదరి మాట్లాడుతూ సమగ్ర శిక్ష ద్వారా సి.డబ్లూ.ఎస్.ఎన్. యొక్క కార్యక్రమాలు, భవిత సేవలు, ఫిజియోథెరపి సేవలు, హెూం బేస్‌డ్ ఎడ్యుకేషన్ సేవల గురించి ఆయన వివరించారు. అనంతరం పిల్లలకు ముఖ్య అతిథుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ సమావేశంలో ఎ యువశ్రీ సాయి వెంకట్ అనే హెూం బేస్‌డ్ చైల్డ్ పేరెంట్ మధు మాట్లాడుతూ సమగ్ర శిక్షా సేవలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సిడబ్లూఎస్ఎన్ మరియు తల్లితండ్రులు, భవిత సిబ్బంది బి.దుర్గాప్రసాద్ రెడ్డి, ఆనందరావు, అపర్ణ, పలువురు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఆదిత్యలో ఘనంగా డా॥ బాబు రాజేంద్రప్రసాద్ జయంతి వేడుకలు

కాకినాడ, మేజర్న్యూస్ : స్థానిక సాంబమూర్తినగర్‌లో గల ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాలలో భారతదేశపు మొట్టమొదటి రాష్ట్రపతి డా॥ రాజేంద్రప్రసాద్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ కె.కరుణ తెలిపారు. ఈ సందర్భంగా ఆదిత్య డిగ్రీ మరియు పి.జికళాశాలల అకడమిక్‌డైరక్టర్ డా॥ బి.యి.వి.ఎల్. నాయుడు మాట్లాడుతూ 1931 లో జరిగిన ఉప్పు సత్యాగ్రహం, 1941 లో జరిగిన క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని స్వాతంత్ర్యం సాధించిన యోధుడు డా॥ రాజేంద్రప్రసాద్ డిసెంబర్ 3వ తేదీ 1884లో జన్మించారుఅనితెలిపారు. అటువంటి మహనీయుడు జయంతి ఉత్సవాలు నిర్వహించడం ద్వారా విద్యార్థులకు వారి జీవిత చరిత్ర ద్వారా ఉత్సాహం, ప్రేరణ కలుగుతాయని అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ కె.కరుణ మాట్లాడుతూ ప్రజలు డా॥ రాజేంద్రప్రసాద్‌ను ప్రేమగా, గౌరవంగా బాబూ అని పిలిచేవారు. 1950 నుండి 1962 వరకు భారతదేశపు మొట్టమొదటి రాష్ట్రపతి భాధ్యతలను నిర్వహించారు అని తెలిపారు. అతడు భారత రాజ్యాంగ నిర్మాణ శిల్పి. 1948 నుండి 1950 వరకు భారత రాజ్యాంగ ముసాయిదా తయారీ కోసం ఏర్పరచిన సంఘానికి అధ్యక్షత వహించారని అన్నారు.

డిసెంబర్ 3 వ తేదీన ఆయన జన్మదిన వేడుకలు తమ కళాశాలలో నిర్వహించిన కళాశాల ఎన్.ఎస్.ఎస్ బృందాన్నిఆమె అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల జాతీయ సేవా పథక కార్యనిర్వహణాధికారులు పి. సురేఖ దేవి, కె.నవ్య , ఎన్.ఎస్.ఎస్ వాలంటీర్లు మరియు అధిక సంఖ్యలో విద్యార్థినులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లుపై ఆర్డీఓ సమీక్ష

పెద్దాపురం,మేజర్న్యూస్ : పెద్దాపురం ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ కె.శ్రీరమణి మంగళవారం సాయంత్రం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి తహశీల్దార్లు, రూట్ అధికారులు, సెక్టార్ అధికారులతో సమావేశం నిర్వహించారు. దీనిలో భాగంగా ఎన్నికల సామాగ్రి, తుది ఏర్పాట్లుపై చర్చించారు. పోలింగ్ 5వ తేదిన ఉదయం 8 నుండి సాయంత్రం 4 గంటల వరకు డివిజన్ పరిధిలో గల మండల పరిషత్ కార్యాలయాల వద్ద ఎమ్మెల్సీ ఉపాధ్యాయ ఎన్నికల పోలింగ్ నిర్వహించబడునని ఆమె తెలిపారు.

అలాగే రూట్ ఎసైన్‌మెంట్ రూట్1–పెద్దాపురం, గండేపల్లి, జగ్గంపేట, ఏలేశ్వరం, రూట్2– తొండంగి, తుని, కోటనందూరు, రూట్3–కిర్లంపూడి, ప్రత్తిపాడు, శంఖవరం, రౌతులపూడి రూట్‌ల పై చర్చించారు. పోలింగ్ సామాగ్రిని సకాలంలో పంపిణీ చేయాలని ఎన్నికల అధికారులు ఆర్డీఓ శ్రీరమణి సూచించారు.

ఈ సమావేశంలో పెద్దాపురం తహశీల్దార్ సిహెచ్.వెంకటలక్ష్మీ, డివిజన్‌లోని తహశీల్దార్లు, రూట్ అధికారులు, సెక్టార్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ దాడులలో 800 లీ. బెల్లపు ఊట ధ్వంసం

– 9లీ.నాటు సారాయి స్వాధీనం

పెద్దాపురం, రూరల్, మేజర్న్యూస్ : పెద్దాపురం ఎక్సైజ్ సిఐ కె.వి.వి.డి.అర్జునరావు ఆదేశాలమేరకుఆధ్వర్యంలో మంగళ వారం పెద్దాపురం సర్కిల్ పరిధిలోని పెద్దాపురం మండలంలోని జె.తిమ్మాపురం గ్రామంలో సారాయి తయారీకి నిల్వ ఉంచిన సుమారు 800లీ.బెల్లపు ఊట ధ్వంసం చేయడం జరిగిందని, అలాగే గండేపల్లి మండలంలోని నీలాద్రిరావుపేట గ్రామంలో సారాయి అమ్ముతున్న ఒక మహిళను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించడం జరిగిందని,ఆమెవద్ద నుండి 9లీ.సారాయి స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సిఐ కె.వి.వి.డి. అర్జునరావు తెలిపారు. ఈ దాడులలో ఎక్సైజ్ ఎస్సైలు మరియు ఎక్సైజ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పన్నుల వసూళ్ళపై ప్రత్యేక దృష్టి – కమీషనర్ పద్మావతి

పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ : పెద్దాపురం పురపాలక సంఘ పరిధిలో పన్నులు, ఇతర మార్గాల ద్వారా వచ్చే ఆదాయ మార్గాలపై దృష్టి సారించడం జరిగిందని, మున్సిపల్ కమీషనర్ కె.వి.పద్మావతి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంటి పన్నులు, కుళాయి పన్నులు, ఖాళీ స్థలాల పన్నులు, మున్సిపల్ కాంప్లెక్స్‌ల ద్వారా వచ్చే ఆదాయాలను వసూలు చేసే దిశగా మున్సిపల్ ఆర్వో వి.చంద్రశేఖరం, ఆర్ఐ గంగాధరంల ఆధ్వర్యంలో ప్రత్యేక దృష్టి సారించడం జరిగిందని ఆమె తెలిపారు.

ముఖ్యంగా మొండి బకాయిదారుల వద్ద నుంచి పన్నుల వసూళ్ళకు ప్రత్యేక టీమ్‌లు ఏర్పాటు చేయడం జరిగిందని, అలాగే సచివాలయ సిబ్బంది, అడ్మిన్‌లు, ఆయా సచివాలయాల పరిధిలో ఇంటి పన్నుల వసూళ్ళపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆమె తెలిపారు. పన్నుల వసూళ్ళపై ఇకపై నిరంతరం సమీక్షించడం జరుగుతుందని, కావున పట్టణ ప్రజలు ఇంటి పన్నులు, కుళాయి పన్నులు, ఖాళీ స్థలాల పన్నులు సకాలంలో మున్సిపల్ ఖజానాకు చెల్లించాలని కమీషనర్ కోరారు.

-సేంద్రియ ఎరువులను వినియోగం వలన ఆరోగ్యవంతమైన ఈ దిగుబడులను సాధించవచ్చు

రాజమహేంద్రవరం,మేజర్న్యూస్ : ప్రకృతి వ్యవసాయం పై రైతులు అవగాహన పెంచుకొని సేంద్రియ ఎరువులను వినియోగించడం వలన ఆరోగ్యవంతమైన పంటలనుపండించవచ్చునని వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డా.డి.శ్రీనివాస్ విద్యార్థులకు సూచించారు. మంగళ వారం రాజమహేంద్రవరం రూరల్ రాజవోలు గ్రామంలో నిర్వహిస్తున్న జాతీయ సేవా పథకం (NSS)కాంప్‌లో భాగంగా ఆచార్య ఎన్ జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయానికి చెందిన వ్యవసాయ కళాశాల, అసోసియేట్ డీన్ డా.డి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగింది. జాతీయ సేవా పథకం ఏడు రోజుల ప్రణాళికలో భాగంగా రాజవోలు గ్రామంలో ఐదవ రోజువరిలో మేలైన యాజమాన్య పద్ధతులు మరియు పోషకాహారంపై అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది.

ఈ కార్యక్రమంలో డీన్ శ్రీనివాస్ మాట్లాడుతూనేడు వ్యసాయ దినోత్సవం అని తెలియచేసారు. వ్యవసాయం యొక్క గొప్పతనాన్ని విద్యార్థిని విద్యార్థుల కు వివరించారు. ఈ సందర్భంగా రాజవోలు జిల్లా పరిషత్ హై స్కూల్ లో అవగాహన సదస్సు నిర్వహించి 9 మరియు 10 వ తరగతి విద్యార్థులకు అగ్రికల్చరల్ యొక్క గొప్పతనాన్ని మరియు కెరీర్ ఇన్ అగ్రికల్చర్ గురించి తెలిపారు. ఈ కార్యక్రమంలో Nss ఇన్చార్జి డా. సిహెచ్.సునీత మరియు డా.సిహెచ్..శ్రీనివాస్ ఆద్వర్యంలో వ్యవసాయ కళాశాల అధ్యాపకులు మరియు ఇతర శాస్త్రవేత్తలు పాల్గొన్నారు. ప్రొఫెసర్ అండ్ హెడ్ అగ్రికల్చరల్ ఎక్సటెన్షన్ డా.పి ఎల్ ఆర్ జె.ప్రవీణ.మాట్లాడుతూ రైతులు వ్యవసాయ ఖర్చులను తగ్గించుకొని దిగుబడులు పెంచుకోవాలి అని తెలిపారు.డ్రోన్ పద్ధతులను అవలంభించడం ద్వారా పురుగు మందులు పిచికారీ చేయవచ్చునని చెప్పారు. రైతులు పచ్చిరొట్ట పైర్లు వేసుకోవాలి అని తెలిపారు. రైతులకి విత్తనాలు ఎమైన కావాలి అంటే డాట్ సెంటర్ పెద్దాపురం నుండి తెప్పించి ఇస్తామన్నారు. అనంతరం ఎంటమాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. బి. అనుష మాట్లాడుతూ వరి నారుమడిలో యాజమాన్య పద్ధతులు గురించి వివరించారు. వరి లో వచ్చు పురుగుల గురించి వాటి యాజమాన్య పద్ధతులు గురించి వివరించారు. రైతులు అవసరం మేరకు మాత్రమే పురుగు మందులు వాడాలి అధికంగా వాడకూడదు దాని వల్ల భూమి మరియు వాతావరణ కాలుష్యం అవుతుందని తెలియచేశారు. కేవీకే శాస్త్రవేత్త డా.దెబోరాబ్ (గృహ విజ్ఞాన శాస్త్రం) మాట్లాడుతూ పౌష్టికాహార అలవాట్ల గురించి వివరించారు,అధిక పురుగు మందులు వాడటం వలన నేల,నీరు,పంటలు, కలుషితం అవడం వలన పౌష్టికాహార లోపం ఏర్పడుతుందన్నారు. పెరటి తోటలు పెంచటం ద్వార పురుగు మందు రహిత కూరగాయలు పెంచవచ్చు అన్నారు. పౌష్టికాహార లోపం వలన అనేక ఆరోగ్య సమస్యలు వస్తాయని తెలిపారు, జడ్ పిహెచ్ఎస్ స్కూల్ విద్యార్థులకు పౌష్టికాహార అలవాట్ల గురించి వివరించారు. అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్, రాజమండ్రి,శ్రీనివాస్ రావు మాట్లాడుతూ వ్యవసాయం అనేది ఎంతో ప్రాముఖ్యం అని ఉతుదేశానికి వెన్నుముక లాంటి వారనికి తెలియ చేశారు. ప్రకృతి వ్యవసాయంపై రైతులు అవగాహన పెంచుకోవాలి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఏ.భీమరాజు, జెడ్ పి హెచ్ స్ ప్రధాన ఉపాధ్యాయురాలు రమాదేవి కళాశాల విద్యార్థినీ విద్యార్థులు, మరియు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ – ఓటు హక్కు కలిగి ఉన్నవారికి ప్రత్యేక క్యాజువల్ శెలవు

–డిసెంబర్ 5 గురువారం ఎన్నికల నేపథ్యంలో ప్రధాన ఎన్నికల అధికారి ఉత్తర్వులు జారీ

– డీ ఆర్వో/ సహాయ రిటర్నింగ్ అధికారి టి. సీతారామ మూర్తి

రాజమహేంద్రవరం, మేజర్న్యూస్ : ఆంధ్రప్రదేశ్ శాసన మండలి తూర్పు–పశ్చిమ గోదావరిఉపాధ్యాయ నియోజక వర్గానికి 05.12.2024 (గురువారం)న జరగాల్సిన ఉపఎన్నికలు నేపథ్యంలో పోలింగ్ రోజున అంటే 05.12.2024న (గురువారం) ఓటర్లకు ప్రత్యేక క్యాజువల్ సెలవుల మంజూరు చెయ్యాలని జిల్లా రెవిన్యూ అధికారి / సహాయ రిటర్నింగ్ అధికారి టి.సీతారామ మూర్తి మంగళవారం ఒక ప్రకటనలో తెలియచేసారు తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, డా.బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ, కాకినాడ, ఏలూరు, అల్లూరి సీతా రామరాజు జిల్లాల్లోని తూర్పు–పశ్చిమ గోదావరి ఉపాధ్యాయ నియోజకవర్గాల నుంచి ఆంధ్రప్రదేశ్ శాసనమండలికి ఉప ఎన్నికకు భారత ఎన్నికల సంఘం షెడ్యూల్‌ను ప్రకటించడం జరిగిందని తెలిపారు. ఆ షెడ్యూల్ ప్రకారం, 05.12.2024 (గురువారం) ఉదయం 8.00 నుండి సాయంత్రం 4.00 గంటల వరకు ఓటు హక్కు కలిగి ఉన్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్లు తమఓటుహక్కును వినియోగించు కోవడం జరుగుతుందని తెలిపారు. ఈ మేరకు అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ మేనేజ్‌మెంట్‌లు/ అథారిటీలు, పైన పేర్కొన్న ఉపాధ్యాయుల నియోజక వర్గంలో నమోదైన తమ ఉద్యోగులు/కార్మికులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని కోరారు. . ఆఫీసు / డ్యూటీకి ఆలస్యంగా హాజరు కావడానికి అనుమతి వంటివిబీ షిఫ్ట్ సర్దుబాట్లు చేసుకోవాలన్నారు. డ్యూటీ గంటలు తక్కువగా ఉండటం లేదా పోల్ రోజున అంటే 05.12.2024 (గురువారం) ఉదయం 8.00 నుండి సాయంత్రం 4.00 గంటల మధ్య వారి ఫ్రాంచైజీ హక్కును వినియోగించుకోవడానికి వీలుగా సర్దుబాటు చెయ్యాలన్నారు.

పోక్సోకేస్‌లో ముద్దాయి తక్షణమే అరెస్ట్

ధవళేశ్వరం,మేజర్న్యూస్ : మహిళలు మరియు బాలికలుపై లైంగిక చర్యలు / నేరాలకు పాల్పడే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ డి.నరసింహ కిషోర్ ఐ.పీ.ఎస్ అన్నారు.తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్ర వరం రూరల్ మండలం, ధవళేశ్వరం గ్రామం నందు గల ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికోన్నత పాటశాల , బొమ్మూరు నందు బాలిక పై లైంగిక చర్యలకు పాల్పడిన అదే పాటశాల నందు హిందీ టీచర్‌గా పనిచేస్తున్నటువంటి తంగేటి సత్యనారాయణ మూర్తి పై వచ్చు పిర్యాదుపై తక్షణమే క్రైమ్ నెంబర్: 267/2024 పోక్సో కేసుగా నమోదు చేసి తూర్పు గోదావరి జిల్లా ఎస్పీ ఉత్తర్వులు ప్రకారంగా సదరు కేసును సౌత్ జోన్ డిఎస్పీ భవ్య కిశోర్ పర్యవేక్షణలో ప్రస్తుత ఇన్స్పెక్టర్ గణేష్ మరియు సబ్–ఇన్స్పెక్టర్ బి.హరిబాబు సమగ్ర దర్యాప్తు చేసి ముద్దాయిని తక్షణమే అరెస్ట్ చేసి గౌరవ కోర్ట్ నందు ప్రొడ్యూస్ చేసి రిమాండ్‌కి తరలించడం జరిగింది.

పులి సంచరిస్తుండడం వల్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

– ఫారెస్ట్ రేంజ్ అధికారి ఉషారాణి

రాజవొమ్మంగి,మేజర్న్యూస్ : మండలంలోని గొబ్బిలమడుగు అడవి ప్రాంతంలో పులి సంచరిస్తుండడం వల్ల ప్రజల అప్రమత్తంగా ఉండాలని రాజవొమ్మంగి ఫారెస్ట్ రేంజ్ అధికారిణి గుమ్మడి ఉషారాణి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆమె విలేకర్లతో మాట్లాడుతూ తమ రేంజ్ పరిధిలోని గొబ్బిలమడుగు అటవి ప్రాంతంలో పులి సంచురిస్తున్నట్లు సమాచారం అందడంతో మంగళవారంతమ సిబ్బందితో వెళ్లి అటవీ ప్రాంతంలో పులి అడుగు జాడలు పరిశీలించి పాద ముద్రలు కొలతలు తీసుకోవడం జరిగిందన్నారు. ఈ మేరకు అక్కడ ప్రజలతోవిచారిస్తున్నామన్నారు. త్వరలో ఏ జంతువు అనేది తెలియజేస్తామన్నారు. అప్పటివరకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పశువులను తోలుకొని ఒంటరిగా అడవి ప్రాంతంలోకి వెళ్లరాదని హెచ్చరించారు. ఆమె వెంట ఎఫ్ఎస్ఓ సుబ్బలక్ష్మి, సిబ్బంది ఉన్నారు.పులి విషయమై దోనెలపాలెం గ్రామస్తులను విచారించగా ముర్ల వీరబాబు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సోమవారం ఉదయం 9:00 ప్రాంతంలో గొబ్బిలిమడుగు గ్రామానికి చెందిన ఇరుగురు వ్యక్తులు బైక్ పైఏలేశ్వరం బయలుదేరి వెళుతుండగా గొబ్బిలమడుగు– ధోనెలపాలెం మధ్య అటవీ ప్రాంతం రహదారిలో బైక్ కి ఎదురుగా పులి కనిపించిందని హారన్ కొట్టినా తప్పుకోక పోవడంతో బయ భ్రాంతులు చెంది తప్పించుకొని ప్రాణాలతో బయట పడ్డామని అనంతరం ఏలేశ్వరం పని చూసుకుని తిరుగు ప్రయాణంలో వెళ్లేటప్పుడు ఆ రెండు గ్రామాల మధ్య అటవీ ప్రాంతంలో మరో చోట పులి కనిపించడంతో వెనుతిరిగి దోనెలపాలెం రావడంతో సోమవారంరాత్రి గ్రామ పెద్ద రెడ్డి రమణ ఇంట్లో ఆ వ్యక్తినిఉంచి మరుసటి రోజు గ్రామస్తులను తోడిచ్చిఅతన్ని పంపించినట్లు వీరబాబు తెలిపారు. అలానే లంగుపర్తి గ్రామానికి చెందిన బూసరి లక్ష్మణ్ కు గల రెండుమేకలలో ఒక దాన్ని పులిగాయపరిచి మరొక దాన్ని చంపి తినేసినట్లు వీరబాబు తెలిపారు. ఈ విషయమై ఫారెస్ట్ అధికారులకు సమాచారం ఇవ్వడం జరిగిందన్నారు. అలానే ఆ గ్రామాల మధ్య గాట్ ప్రదేశం ఉండడం వల్ల రహదారి సదుపాయం సరింగా లేక ఏ క్షణమైన పిల్లలు, మహిళలపై పులి దాడి చేస్తుందోనని భయాందోళనకు గురవుతున్నామని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ఫారెస్ట్ ఉన్నత అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

విద్యా బాల మందిర్ డా.బాబు రాజేంద్రప్రసాద్ జయంతి వేడుకలు

కొత్తపేట,మేజర్న్యూస్ : డా బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం కొత్తపేట విద్యా బాల మందిర్ హైస్కూల్‌లో భారత మాజీ రాష్ట్రపతి డాక్టర్ బాబు రాజేంద్రప్రసాద్ 140 జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి కరస్పాండెంట్ అనురాధ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఆమె మాట్లాడుతూ రాజేంద్రప్రసాద్ గారు 1884 డిసెంబర్ 3 తేదీన జన్మించారు. ఈయన భారతదేశానికి మొదటి రాష్ట్రపతిగా బాధ్యతలు స్వీకరించారు. భారతదేశానికి రెండు సార్లు రాష్ట్రపతి చేసిన ఏకైక వ్యక్తి.ఇతనిని ప్రేమగా "బాబు" అని పిలిచేవారు. భారత జాతీయ కాంగ్రెస్‌లో చేరి మహాత్మా గాంధీ మద్దతుధారునిగా 1931 సంవత్సరంలో జరిగిన ఉప్పు సత్యాగ్రహం ఉద్యమంలో పాల్గొని జైలు శిక్షను అనుభవించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయులు నూకపేయి శివరత్నం, ఉపాధ్యాయులు విద్యార్థులు అందరూ పాల్గొని నివాళులర్పించారు.

వైద్య సేవలు అందించడంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు

–ఐటిడిఎ పిఓ సింహాచలం

రాజవొమ్మంగి, మేజర్న్యూస్ : హాస్పిటల్ కి వచ్చిన రోగులకు వైద్య సేవలు అందించడంలో వైద్య సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని రంపచోడవరం ఐటీడీఏ పిఓ కట్టా సింహాచలం హెచ్చరించారు. మంగళవారం మండలంలోని జడంగి పిహెచ్సిని ఆయన ఆకస్మిక గా తనిఖీ చేశారు. గత నెల 30న జెడ్డంగి పిహెచ్ సి పరిధిలోనివంచంగి గ్రామానికి చెందిన పోలిశెట్టి నూకరత్నం(32) అనే నిండు గర్భిణి ఏలేశ్వరం నుండి కాకినాడ రిఫరల్ చేయగా మార్గం మధ్యలో బిడ్డతో సహా ఎలామృతి చెందిందని స్థానిక వైద్యులు నాగార్జునను ప్రశ్నించి వివరాలు తెలుసుకున్నారు. హాస్పిటల్ కి వచ్చిన రోగులకు తక్షణమే వైద్య పరీక్షలు నిర్వహించి మెరుగైన వైద్య సేవలు అందించి అవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవాలనివైద్యులను పిఓ ఆదేశించారు. పిఓ వెంట అసిస్టెంట్ కలెక్టర్ భావన ఉన్నారు.

భవిత కేంద్రం సేవలు వినియోగించుకోవాలి

–ఎంపీడీవో హిమా మహేశ్వరి

సామర్లకోట, మేజర్న్యూస్ : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా అమలు జరుగుతున్న భవితా కేంద్రం ద్వారా దివ్యాంగులకు అందిస్తున్న సేవలను ప్రతి దివ్యాంగ విద్యార్థులు వినియోగించుకోవాలని సామర్లకోట మండల పరిషత్ అభివృద్ధి అధికారిని కేహిమామహేశ్వరి పేర్కొన్నారు.మంగళవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా స్థానిక భవిత విద్యా కేంద్రంలో మండల విద్యాశాఖ అధికారి 2 పి పుల్లయ్య అధ్యక్షతన అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంపీడీవో హిమా మహేశ్వరి మాట్లాడుతూ దివ్యాంగులు అందరితో కలిసి ఉండేలాగా తల్లిదండ్రులు బాధ్యత తీసుకోవాలని అన్నారు. తద్వారా భవిత కేంద్రాలకు వెళ్లడం ద్వారా విద్యార్థులు అందరితో కలిసి అనేక విషయాలు నేర్చుకోవడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. భవిత కేంద్రం ద్వారా అందిస్తున్న సేవలను ప్రత్యేక ఉపాధ్యాయులు ద్వారా విద్యార్థులకు దివ్యాంగులకు తరగతులు నిర్వహిస్తున్నారని అన్నారు. మండల విద్యాశాఖ అధికారి 2 పి. పుల్లయ్య మాట్లాడుతూ ఈ కేంద్రం ద్వారా అందిస్తున్న కార్యక్రమాలను దివ్యాంగులయి న పిల్లలు వినియోగించుకునే విధంగా తల్లిదండ్రులు చూడాలని అన్నారు. వీరికి ప్రత్యేకమైన ప్రతిభ ఉంటుందని అందువలన క్రమం తప్పకుండా భవిత కేంద్రాలకు విద్యార్థులను పంపవలసిన అవసరత ఉందన్నారు అంతకుముందు అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం పురస్కరించుకొని స్థానిక భవిత కేంద్రంలో వద్ద విద్యార్థులు చేత ర్యాలీ నిర్వహించారు అనంతరం తోట గోపాలకృష్ణ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న శివ బ్లైండ్ ఉపాధ్యాయునికి ఈ సందర్భంగా సన్మానించారు. అనంతరం దివ్యాంగ విద్యార్థులకు నిర్వహించిన ఆటలు పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అక్షయ ఫౌండేషన్ ద్వారా విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు అల్పాహారం అందజేశారు. లైన్స్ క్లబ్ ద్వారా దివ్యాంగు విద్యార్థిలకు దుప్పట్లు పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి 1 వై. శివరామకృష్ణయ్య జిల్లా మానవ హక్కుల సంఘం అధ్యక్షులు నూతలపాటి అప్పలకొండ లైన్స్ క్లబ్ మాజీ కార్యదర్శి కే ఆదినారాయణ రెడ్డి కోశాధికారి బడుగు బాబి సామర్లకోట హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు తోటకూర సాయిరామకృష్ణ యు మీనా మాధురి, హనుమంతరావు ఎంఆర్సి సిబ్బంది, భవిత కేంద్ర సిబ్బంది అనిత, పద్మ తదితరులు బేబీ నాగేశ్వరి పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రం పరిశీలన

పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ : ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పెద్దాపురం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పొలింగ్ కేంద్రాన్ని మంగళవారం పెద్దాపురం తహశీల్దార్ సిహెచ్.వెంకటలక్ష్మి వసతులను పరిశీలించి, పలు సూచనలు చేశారు. ఆమె వెంట సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బేతేలు స్వస్థతశాల సెమీ క్రిస్టమస్ వేడుకల్లో ఎమ్మెల్యే 'మద్దిపాటి'

ద్వారకాతిరుమల,మేజర్న్యూస్: మండలంలోని తిమ్మాపురం గ్రామ శివారులో బేతేలు స్వస్థత చాలా నందు సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనముగా జరిపారు. ముఖ్యఅతిథిగా స్థానిక ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు పాల్గొని క్రీస్తుజననం అందరికీ పవిత్ర మని ఏసు మానవాళికి ఆదర్శనీయుడని ఆయన అన్నారు. జీసస్ సమాజాన్ని సక్రమమైన మార్గంలో నడిపించడానికి జన్మించారని పేర్కొన్నారు.ఈక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు లంక సత్యనారాయణ, మాజీ ఎంపీపీ ఏపూరి దాలయ్య,మండల పార్టీ నాయకులు పోలిన శ్రీను,మట్టపర్తి రూపేష్ కుమార్, చింతమనేని హనుమంతరావు, గంటా శ్రీనివాసరావు, యేపూరి కిషోర్,మండల పాస్టర్స్ అసోసియేషన్ సభ్యులు వివిధ గ్రామాల నుంచి వచ్చిన విశ్వాసులు పాల్గొన్నారు.

ఇంటిగ్రేటెడ్ ఎడ్యుకేషనల్ హబ్‌గా 570 ఎకరాలతో భూపతిపాలెం రెసిడెన్షియల్ స్కూల్ అభివృద్ధి చేయాలి

–విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేసిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

జగ్గంపేట,మేజర్న్యూస్ :అమరావతిలోని సచివాలయంలో మానవ వనరుల శాఖ మంత్రి, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ను కలిసి భూపతిపాలెం రెసిడెన్షియల్ స్కూల్ ఏరియాలో ఎడ్యుకేషనల్ హబ్, స్కిల్ హబ్ గా ఆ ప్రాంతాన్ని తీసుకోవాలని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేసి లోకేష్ వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో ఎన్నో జాతీయ అంతర్జాతీయ ట్రిబుల్ ఐటీ, ఎన్ఐటి, ఏఐఎం, ఎన్నో విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేసి మన ఆంధ్రప్రదేశ్ ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకి, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కి నా చిన్న విన్నపం విన్నవించుకుంటున్నానని మెట్ట ప్రాంత ప్రజల ఆకాంక్ష నా40 సంవత్సరాల సుదీర్ఘ రాజకీయ జీవిత లక్ష్యం ఇక్కడ ఉన్న విద్యార్థులం దరికీ ఒకే చోట కేజీ నుంచి పీజీ వరకు విద్యను అందించాలని సంకల్పంతో గోకవరం మండలం భూపతి పాలెం వద్ద అత్యుత్తమ విద్యలన్నిటిని ఒకే చోట ఇంటిగ్రేటెడ్ఎడ్యుకేషనల్ హబ్, స్కిల్ క్యాంపస్ ఏర్పాటు చేయాలని కోరుకుంటున్నాను అని అన్నారు. 1962లో డాక్టర్ డిఎస్ రాజు స్థాపించిన భారతీయ సాంస్కృతిక విద్యాపీఠం ట్రస్ట్ 171 ఎకరాల భూమిని సేకరించి అందులో విద్యాపీఠం ఏర్పాటు చేస్తే 1983లో అన్న నందమూరి తారక రామారావు ముఖ్యమంత్రి అయిన తర్వాత ఆ విద్యాపీఠాన్ని ఏపీ రెసిడెన్షియల్ స్కూల్ మార్చడం జరిగిందని అక్కడే మరో 400 ఎకరాల పైచిలుకుఎసైడ్ హిల్ భూమి ఈ ఇంటిగ్రేటెడ్ ఎడ్యుకేషన్ హబ్ ఏర్పాటు చేయడానికి ప్రోత్సాహకరంగా ఉంది అని అన్నారు. అగ్రికల్చరల్, ఆర్టికల్చరల్ క్యాంపస్ ఏర్పాటు చేయాలని, గ్రామీణ విద్యార్థులను ఇంజనీర్లుగా తీర్చిదిద్దడానికి ట్రిబుల్ ఐటీ క్యాంపస్ ఏర్పాటు చేయాలని, గవర్నమెంట్ పాలిటెక్నిక్ కాలేజ్, డిగ్రీ, పీజీ పూర్తి చేసేందుకు పీజీ కాలేజ్ కూడా ఏర్పాటు చేయాలని వెటర్నరీ కాలేజీ కూడా ఏర్పాటు చేయాలని అదేవిధంగా నర్సింగ్ కాలేజ్ 50 పడకల ఆసుపత్రి, యువతకు టెక్నికల్ స్కిల్ అందించే స్కిల్ యూనివర్సిటీ అదేవిధంగా భూపతిపాలెం రెసిడెన్షియల్ స్కూల్ పదో తరగతి నుండి ఇంటర్మీడియట్ కు క్వాలిఫై అయిందని దానితోపాటు నేను తెలిపిన ఇవన్నీ కూడా ఏర్పాటు చేయడానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు సమకూర్చి ఇంటిగ్రేటెడ్ ఎడ్యుకేషనల్ హబ్, స్కిల్ హబ్ నిర్మించాలని కోరానని జ్యోతుల నెహ్రూ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జ్యోతుల నవీన్ తనయుడు జ్యోతుల అనీష్ నెహ్రూ తదితరులు ఉన్నారు.

ఘనంగా ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం

చింతూరు, మేజర్న్యూస్ : చింతూరు మండలంలోని ఎర్రంపేటలో ఇంక్లూసివ్ ఎడ్యుకేషన్ సెంటర్ భవిత సెంటర్ నందు ప్రపంచ దివ్యాంగుల దినోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి.ఈకార్యక్రమంలో ఎండిఓ చైతన్య ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల స్థాయిలో భవితసెంటర్‌లో అందించే సేవలను దివ్యాంగ చిన్నారులు సద్వినియోగం చేసు కోనేటట్లు తల్లిదండ్రులు అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈకార్యక్రమంలో పండా కిష్టయ్య, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో శ్యామ్‌రాజు చిన్నారుల అభివృద్ధి చెందుతున్న తీరును కొనియాడారు. ఈ సందర్భంగా పిల్లలకు, స్వీట్, హాట్, స్నాక్స్, రగ్గులు, బహుమాతులు అందజేశారు.

ఈ కార్యక్రమంలో శ్యాం సుందరబాబు, అమతి కే.జయలక్ష్మి, శారద, దివ్యాంగుల తల్లితండ్రులు పాల్గొన్నారు.

దారి దోపిడి కేసు చేధించిన పోలీసులు

– అభినందించిన రూరల్ సీఐ దుర్గాప్రసాద్

నర్సాపురం,మేజర్న్యూస్ : మొగల్తూరు మండలం జగన్నాధపురం రోడ్డు పక్కన విసర్జనకు వెళ్ళగా ముసునూరి దుర్గారావు బాధితుడు ని కొట్టి పక్కనే ఉన్న కొబ్బరి తోటలోకి లాక్కొని వెళ్లి అతని వద్ద సెల్ఫోన్ ,ఫాంట్ జేబులో ఉన్న 22 వేల రూపాయలు నగదు లాక్కొని అరిస్తే చంపేస్తామని బెదిరించినట్టు కేసు నమోదు అయింది. ముద్దాయిలు విగ్నేష్ రాయుడు,రాజు,ట్రాన్స్ జెండర్ నిత్యరోజి రూరల్ సిఐ దుర్గాప్రసాద్ తెలిపారు. మంగళవారం విలేకరుల సమావేశంలో ఈ విషయాన్ని వెల్లడించారు. కేసును చాకచక్యంగా చేదించి ముద్దాయిలను ముగ్గురిని పట్టుకున్నట్లు ఆయన తెలిపారు. వీరి వద్ద నుండి సెల్ ఫోన్,బజాజ్ ఎన్ఎస్ పల్సర్ బండిని సీజ్ చేశారు.